సాక్షి పల్నాడు

శనివారం ၊ 6 ၊ మే ၊ 2023



వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు

మంగళగిరి: ద్వారకా తిరుమలలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టు వస్త్రాలు, అమ్మవారికి సారె బహూకరించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.



వైభవంగా లక్ష మల్లెల అర్చన

నరసరావుపేట రూరల్: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామివారికి శుక్రవారం రాత్రి లక్ష మల్లెల అర్చనను వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, డాక్టర్ బి.నాగరాజు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన ఎంఏ తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్‌వర్క్, జర్నలిజం, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్స్ అండ్ న్యూట్రీషనల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎంకాం, బీఎల్‌ఐఎస్సీ, ఎంఎల్‌ఐఎస్సీ, ఎంబీఏ ఎల్‌ఎల్‌ఎం కోర్సుల పరీక్షా ఫలితాలను శుక్రవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ విడుదల చేశారు. ఫలితాలను www.anucde.info వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. జవాబుపత్రాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 19 ఆఖరు తేదీగా నిర్ణయించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులాబ్దీన్, శివరామకృష్ణ, పలితదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు

చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు ఈనెల 15 నుంచి జూన్ నెల 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డిలు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మిర్చి యార్డు దిగుమతి, ఎగుమతి షాపుల కార్మిక సంఘం, దిగుమతి వ్యాపారుల సంఘం సూచనలు, అభ్యర్థనల మేరకు ప్రస్తుత వేసవి సీజనులో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి సెలవులు ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ వరకు మాత్రమే మిర్చి బస్తాలను యార్డులోపలికి అనుమతిస్తారని, రైతులు సహకరించి యార్డుకు తమ తమ మిర్చి బస్తాలను సెలవు రోజుల్లో యార్డుకు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. ఈనెల 15 నుంచి జూన్ 11వ తేదీ వరకు యార్డులో ఎలాంటి క్రయ విక్రయాలు జరపబడవని తెలిపారు. జూన్ 12వ తేదీ నుంచి యార్డులో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని వారు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.00 అడుగుల వద్ద ఉంది. ఇది 152.8470 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 807.50 అడుగుల వద్ద ఉంది. ఇది 32.8794 టీఎంసీలకు సమానం.

ఇరువురు ఏఎన్‌ఎంలు సరెండర్

కొల్లూరు: ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త నడుమ చోటు చేసుకున్న వివాదం.. ఓ ఏఎన్‌ఎంపై మరో ఏఎన్‌ఎం చేసిన ఫిర్యాదుల మేరకు ఇరువురు సచివాలయ ఏఎన్‌ఎంలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి సరెండర్ చేయాలని సంబంధిత శాఖ అధికారుల నుంచి వైద్యాధికారి రవిబాబుకు ఆదేశాలు అందాయి. గత కొంత కాలంగా కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, వైద్యాధికారి, సిబ్బంది నడుమ అంతర్గతంగా వివాదాలు నెలకొని ఉన్నాయి. వైద్యాధికారికి సన్నిహితంగా ఉంటున్న కొందరు సిబ్బందిపై ఆధిపత్యం చేస్తుండటం వివాదాలకు కారణంగా విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఏఎన్‌ఎంలను సరెండర్ చేయడం పీహెచ్‌సీ సిబ్బంది అంతర్గత వివాదాన్ని బహిర్గతం చేస్తుంది. కొల్లూరు సచివాలయం–2లో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి, వైద్యాధికారి డి.రవిబాబుపై అనంతవరం సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం పీఎస్‌టీ కుమారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనికి తోడు అనంతవరం ఏఎన్‌ఎం పీఎస్‌టీ కుమారికి అక్కడి ఆశ కార్యకర్తకు నడుమ వివాదం నడుస్తుండటంతో గతంలో ఇరువురు ఒకరిపై ఒకరు కొల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారు. ఈసంఘటనలపై స్పందించిన వైద్య శాఖాధికారులు ఇరువురు ఏఎన్‌ఎంలను సరెండర్ చేయాలని వైద్యాధికారి రవిబాబును ఆదేశించారు. ఈ సంఘటనపై వైద్యాధికారి మాట్లాడుతూ, అధికారుల ఆదేశాల మేరకు ఏఎన్‌ఎంలు ఇద్దరిని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సరెండర్ చేయనున్నట్లు తెలిపారు.

పేదల ఇంటి పండుగ

- మరో రెండువారాల్లో పంపిణీ
- అడ్డంకులను ఎదుర్కొని ముందుకెళ్లిన ప్రభుత్వం
- హైకోర్టు ఆదేశాలతో పేదలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు, ప్రజాసంఘాలు

అమరావతిలో ఇళ్ల స్థలాలకు లైన్ క్లియర్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ సాక్షి నెట్‌వర్క్: గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని సుమారు 48 వేల కుటుంబాలకు పండుగొచ్చింది. ఇప్పటివరకూ సొంతింటి స్థలం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న పేదలకు హైకోర్టు తీర్పు ఆనందదాయకమైంది. పేదలకు తమ ప్రాంతంలో ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందంటూ కొంతమంది రైతుల ముసుగులో కోర్టును ఆశ్రయించడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియకు జాప్యం జరిగింది. రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన ప్రయత్నానికి ప్రభుత్వం, హైకోర్టు అడ్డుకట్ట వేశాయి. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండటానికి వీల్లేదు అనే దుర్మార్గమైన ఆలోచనతో తెలుగుదేశం నాయకులే రైతుల పేరుతో పిటీషన్ దాఖలు చేసి పట్టాలు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు హైకోర్టు తీర్పుతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజా సంఘాలు కూడా ఈ తీర్పును స్వాగతించాయి.




అమరావతి ప్రాంతంలో ఇళ్ల స్థలాల చదును కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి(ఫైల్).



ముమ్మరంగా జరుగుతున్న చదును పనులు

ఇది ప్రజా విజయం



పేదల పక్షాన ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఖచ్చితంగా ప్రజా విజయమే. రాష్ట్ర ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో అణగారిన వర్గాలకు మేలు చేయాలనే తలంపుతో ముందుకు వెళ్లింది. టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ఆఖరికి పేదలకు మేలు జరిగేలా తీర్పు రావడం హర్షణీయం.

– చెన్నంశెట్టి చక్రపాణి, విశ్రాంత ఎస్పీ

ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నాం



ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థలం కోసం అర్జీ పెట్టుకున్నా. ఇంటికి వచ్చిన అధికారులు విచారించి ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. రెండేళ్లుగా ఎదురు చూస్తున్నా. త్వరలో రాజధాని ప్రాంతంలో ఇంటి స్థలం వస్తుందని ఎదురు చూస్తున్నాం.

– పెద్దపల్లి ఏసు మరియమ్మ, ఉప్పలపాడు

చంద్రబాబు అండ్ కోకు చెంపపెట్టు లాంటి తీర్పు



రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ప్రభుత్వం ఇచ్చిన జీఓ నం. 45కి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడాన్ని అడ్డుకుంటూ హైకోర్టును ఆశ్రయించిన చంద్రబాబు అండ్ కో కు ఇది చెంపపెట్టు లాంటి తీర్పు.

– డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, ఐడియా జాతీయ అధ్యక్షుడు

హైకోర్టు తీర్పు హర్షణీయం



రాజధాని ప్రాంతంలో పేదలకు, దళితులకు, దళిత క్రైస్తవులకు ఇళ్ల స్థలాలు కేటాయించవచ్చంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి తగిన భరోసా కల్పించాలనే సీఎం వైఎస్ జగన్ ఆలోచన విధానానికి అడ్డుపడిన వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం లాంటిది.

– సోమి కమల్, రెల్లి సామాజిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు

రోడ్డు పక్కన గుడిసెల్లో ఉంటున్నాం..



రోడ్డు పక్కన గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్నాం. తెనాలి నందివెలుగు రోడ్డు విస్తరణకు సహకరించి రోడ్డుకు రెండు పక్కల ఉంటే వారంతా ఆరు అడుగుల స్థలాన్ని ఇచ్చాం. మా ఇళ్లు ఆనుకుని రాత్రింబవళ్లు లారీలు, బస్సులు తిరుగుతున్నాయి, ఎప్పుడు ఏ వాహనం ఇళ్లలోకి చొరబడుతుందోనని భయం భయంగా గడుపుతున్నాం. మాకు త్వరగా ఇళ్ల స్థలాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– కగ్గా సుధారాణి, తక్కెళ్లపాడు

హైకోర్టు తీర్పు అభినందనీయం..



రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై హైకోర్టు తీర్పు అభినందనీయం. రాజధాని ప్రాంతం అభివృద్ధిలో అందరూ భాగస్వాములుగా ఉండాల్సిందే. అన్నివర్గాల ప్రజలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజామోదయోగ్యంగానే ఉంటుంది.

– మిరియాల గోపీకుమార్, కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు

టీడీపీ నాయకులకు ఇష్టం లేదు..



అద్దెలు కట్టలేక అల్లాడుతున్నాం. ఎక్కడ ఇంటి స్థలం ఇస్తే అక్కడకు వెళతాం. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదు. వాళ్లు ఇవ్వరు.. ఇచ్చేవాళ్లను ఇవ్వనీయరు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఆయనకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని అడ్డుకుంటున్నారు. మాకు ఎక్కడ ఇళ్ల స్థలం వస్తుందో, ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని వాళ్లకు భయం.

– షేక్ షబానా, పెదకాకాని

కంటిపై కునుకు కరువు

- వీడని వర్షంతో రైతులకు ఇబ్బందులు
- కోతల దశలో ఉన్న మొక్కజొన్న, జొన్న, వరి
- పలు చోట్ల కల్లాల్లోనే పంట ఉత్పత్తులు
- గత 24 గంటల్లో సగటున 17.2 మిల్లీ మీటర్ల వర్షపాతం
- పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేస్తున్న అధికారులు
- తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆందోళనలో రైతులు
- అప్రమత్తమైన అధికారులు



వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, కొరిటెపాడు: అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గత ఐదు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తూనే ఉంది. ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు మించడం లేదు. మే నెల ఆరంభంలో ఎండలు విపరీతంగా ఉంటాయని భావించినప్పటికీ అకాల వర్షంతో ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించింది. వాతావరణం అప్పుడప్పుడు తెరపివ్వటంతో రైతులు కల్లాల్లో ఉన్న పంట సంరక్షణ, సస్యరక్షణ చర్యల వైపు దృష్టి పెట్టారు. మళ్లీ తుఫాను ముంచుకొస్తుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ద్రోణి ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఐదు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, జొన్న, మిర్చి, పసుపు, పంట మీద ఉన్న మొక్కజొన్న, జొన్న చేలకు నష్టం వాటిల్లింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా సగటున 17.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. మరోవైపు మరో రెండురోజుల్లో బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడనుందన్న వార్తలు రైతాంగాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

మొలకలు.. ఫంగస్...

రబీ సీజన్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 1.02 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 7 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేశారు. అయితే గుంటూరు జిల్లాలోని తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, చేబ్రోలు, కాకుమాను, మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, పెదకాకాని, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లో 3,347 హెక్టార్లలో పంట మీద ఉన్న మొక్కజొన్న, జొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనాలు వేశారు. (మొక్కజొన్న 2,119 హెక్టార్లు, జొన్న 1,223 హెక్టార్లు, ధాన్యం ఐదు హెక్టార్లు ఉంది.) అలాగే తాడేపల్లి మండలంలో మరో ఆరు హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పలు చోట్ల కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు, కండెలు మొలకలు వచ్చాయి. జొన్న కంకులకు ఫంగస్ వ్యాపించి కంకులు నలుపు మారిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పంట నాణ్యత దెబ్బతింటుందని మార్కెట్‌లో ధర ఏ మేరకు అందుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. వ్యవసాయ అధికారులు, లాం ఫాం శాస్త్రవేత్తలు పంట నష్టం గుర్తించే పనిలో నిమగ్నం కావడంతో పాటు రైతులకు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

పల్నాడు జిల్లాలో 457.4 హెక్టార్లలో నష్టం...

పల్నాడు జిల్లాలో ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలకు నకరికల్లు, ముప్పాళ్ల, బెల్లంకొండ, రాజుపాలెం, బొల్లాపల్లి మండలాల్లో 419.4 హెక్టార్లలో వరి, 30 హెక్టార్లలో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 8 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

బాపట్ల జిల్లాలో...

అకాల వర్షాలకు బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలంలో 2000 ఎకరాలలో మొక్కజొన్న పంట నేలవాలిపోయి నష్టం వాటిల్లింది. అదే మండలంలో కల్లాల్లో ఉన్న మొక్కజొన్న విత్తనాలు 1800 క్వింటాళ్లు తడిసిపోయి మొలకలు వచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

చేబ్రోలులో 77 మి.మీ వర్షం...

గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 77 మిల్లీ మీటర్లు వర్షంపడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 0.2 మి.మీ వర్షం పడింది. సగటున 17.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గుంటూరు తూర్పులో 76 మి.మీ., ఫిరంగిపురం 34.2, గుంటూరు పశ్చిమ 31, పొన్నూరు 27.8, పెదకాకాని 23.8, వట్టిచెరుకూరు 14.8, మేడికొండూరు 13.2, ప్రత్తిపాడు 5.2, పెదనందిపాడు మండలంలో 2 మి.మీ చొప్పున వర్షం పడింది.

శుభమస్తు.. కల్యాణమస్తు



జిల్లాలోని లబ్ధిదారులకు మెగాచెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, అధికారులు

- జిల్లాలో 269 జంటలకు రూ.2.87కోట్లు
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా జంటలకు తాంబూలాలు అందజేత
- సీఎం కార్యక్రమాన్ని లబ్ధిదార్లతో కలిసి వీక్షించిన జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద 269 జంటలకు రూ.2.87కోట్ల లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జనవరి, మార్చి–2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో నిధులను జమచేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లబ్ధిదార్లతో కలిసి వీక్షించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదార్లకు అందజేసి వివాహం చేసుకున్న జంటల్లో ఆడపిల్లలకు జాకెట్ క్లాత్, తాంబూలం, స్వీట్లు అందజేసి ఆశీర్వదించారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధి పొందిన వారిలో బీసీ కులానికి చెందిన 84 మంది, ఓసీలో ఒకరు, ఎస్సీలలో 68, ఎస్టీలలో 16 మంది లబ్ధి పొందారన్నారు. వీరిలో దివ్యాంగులు నలుగురు, కులాంతర వివాహం చేసుకున్న 22 మంది, మైనారిటీలు 81మంది, ఒకే కులానికి చెందిన జంటలు 247 మంది ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జంటలకు రూ.లక్ష చొప్పున, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20లక్షలు, బీసీలకు రూ.50వేలు, బీసీలలో కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.75 వేలు, దివ్యాంగులకు రూ.1.5లక్షలు, రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులకు రూ.40వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందన్నారు. ఆడపిల్లల తల్లుల ఖాతాలకు, తల్లి లేకపోతే ఆడపిల్లల ఖాతాలకే నేరుగా నగదు జమ చేస్తోందన్నారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ , డీడీఓ మహాలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇంద్రగిరికి భక్తిహారం

- నయనానందకంగా గిరి ప్రదక్షిణ
- పల్లకీపై ఊరేగిన ఆది దంపతులు



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్క రించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో నిర్వహించిన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శుక్రవారం దేవస్థాన ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమైంది. ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ మూర్తులకు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేద మంత్రోచ్ఛరణలతో ఆది దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువుదీరారు. జై భవానీ.. జైజై భవానీ నామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు సాగింది. గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, నాలుగు స్తంభాలు, విద్యాధరపురం, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కలరా హాస్పిటల్, చిట్టినగర్, కేటీ రోడ్డు, బ్రాహ్మణ వీధి మీదుగా గిరి ప్రదక్షిణ కొనసాగింది. గిరి ప్రదక్షిణలో తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన ఆది దంపతులకు భక్తులు హారతులివ్వగా, కలరా హాస్పిటల్ సమీపంలోకి విచ్చేసిన ప్రచార రథానికి స్థానికులు పూలతో స్వాగతం పలికారు.

రమణీయం.. రంగనాథుడి కల్యాణం

- గరుడవాహనంపై స్వామివారి ఊరేగింపు
- ఆకట్టుకున్న కోలాట నృత్యాలు



పెండ్లి కుమారుడిగా ముస్తాబైన రంగనాథుడు

యద్దనపూడి: చారిత్రక సొలస గ్రామంలోని భూసమేత రంగనాయకస్వామి ఆలయంలో ఆధ్యాత్మికత శోభిల్లింది. శుక్రవారం రాత్రి వేదమంత్రోచ్ఛరణతో జరిగిన మహత్కార్యం భక్తులను అలరించింది. బ్రహ్మోత్సవాలు అంబరాన్ని తాకాయి. నూతన వధూవరులుగా సర్వాంగ సుందరంగా కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి, రంగనాథుడిని చూసి నింగీ, నేలా మురిశాయి. ఈ రమణీయ దృశ్యాన్ని చూసి ప్రకృతి సైతం పులకించిపోయింది. పరిమళ భరిత పుష్పాలతో అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి.. స్వామి, ఉభయ దేవేరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం కనుల పండువగా మాంగల్యధారణ తంతును వైభవోపేతంగా జరిపించారు. ఆలయ అర్చకుడు పర్చూరి రామకృష్ణమాచార్యులు వైదిక బృందం పర్చూరి నితిన్ కుమార్, బృందవనం పార్థసారధి పరిణయ క్రతువును కమనీయంగా పూర్తి గావించారు. తర్వాత తలంబ్రాల ఘట్టం ఆద్యంతం భక్తులను పులకింజేసింది. కల్యాణ సందర్భంగా స్వామివారికి, అలాగే అమ్మవార్లకు అర్వపల్లి వెంకట హనుమత్ నాగేశ్వరరావు, రమాదేవి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. శనివారం ఉదయం గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిగింది. అనంతరం అర్చన, హోమ, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలను ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి సాంబశివరావు, కామేశ్వరీదేవి, అర్వపల్లి వెంకటస్వామి, వెంకట రాజరాజేశ్వరీ దంపతులు పర్యవేక్షించారు. గుంటూరు చెందిన వెంకటేశ్వర కోలాట సమాజం వారిచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. గ్రామపెద్దలు, ఈఓ సీహెచ్ శివయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు
- హెల్ప్‌లైన్ నంబర్ 88977 98430
- సమావేశంలో కమిషనర్ సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ శివశంకర్



పంట పొలాలను పరిశీలిస్తున్న కె.సూర్యకుమారి, కలెక్టర్ శివశంకర్ అధికారులు

రాజుపాలెం: అకాల వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి వెంటనే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాలని పల్నాడు జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.సూర్య కుమారి ఆదేశించారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలోని దేచవరం, చల్లగుండ్ల గ్రామాల్లో అకాల వర్షానికి నష్టపోయిన వరి పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. వానకు నేలవాలిన వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి అంచనా తయారు చేసి వెంటనే ప్రభుత్వానికి పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.శివశంకర్‌కు సూచించారు. నకరికల్లు మండలంలో ఇప్పటి వరకు 250 హెక్టార్లలో వరి పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఆమె వెంట కలెక్టర్ కె.శివశంకర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బెన్ని, డ్వామా పీడీ జోసఫ్ పాల్గొన్నారు.


రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

నరసరావుపేట: అకాల వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటలకు చెందిన రైతులు భయ పడాల్సిన పనిలేదని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ సూర్యకుమారి తెలిపారు. నకరికల్లు మండలంలోని దేచవరం, చల్లగుండ్ల గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అనంతరం కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడారు. సూర్య కుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 419 హెక్టార్లలో వరిపంట, తొమ్మిది హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లుగా ప్రాథమికంగా అంచనా వేశారన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 88977 98430కు రైతులు సహాయం కోసం సంప్రదించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం.. సుందరయ్య కాలనీకి చెందిన లారీ డ్రైవర్ పొట్లూరి రాజేష్(28)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. రోజూ మద్యం తాగివస్తున్నాడని భార్య అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన రాజేష్ శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు పీఎం యశస్వి



- కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలు
- ఆగస్ట్ 26 వరకు దరఖాస్తుకు అవకాశం



సత్తెనపల్లి: ప్రస్తుతం పోటీ విద్యా విధానంలో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్న నైపుణ్యాలను బయట పెట్టుకోలేక చదువును అర్ధాంతరంగా ఆపేస్తున్నారు. ఇలా విద్యను మధ్యలోనే ఆపేసిన విద్యార్థులు కూలీలు గానో, మెకానిక్ షెడ్లలోనో పని చేస్తున్నారు. మరికొందరు ఉన్నత చదువులు చదివేందుకు తగిన ఆర్థిక స్తోమత లేక చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇలాంటి విద్యార్థులను పాఠశాల బాట పట్టించాలని కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఓ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా నైపుణ్యం కలిగిన విద్యార్థికి ఏడాది కి రూ.75 వేల నుంచి రూ.1.10 లక్షల వరకు ఉపకార వేతనంగా లభిస్తుంది. అది కూడా నాలుగు సంవత్సరాల పాటు అదే ప్రధాన మంత్రి యశస్వి(యంగ్ అచీవర్స్ స్కాలర్షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా) పథకం. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పథకాన్ని నిర్వహిస్తోంది.

ఎంపిక ఇలా..

- కేంద్ర విద్యాశాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు 8వ తరగతి పూర్తయి ఉండాలి.
- 9,10 తరగతులు పూర్తయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ వరకు మాత్రమే ఉపకార వేతనం వస్తుంది.
- ఓబీసీ, ఈబీసీ తరగతులకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- 9వ తరగతిలో దరఖాస్తు చేసుకునేవారు 2004 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2008 మార్చి 31 లోగా జన్మించి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోగా వారు మాత్రమే అర్హులు.
- గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, రైతులు, వెనుకబడిన కుటుంబాల్లోని పిల్లలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తు ఇలా ...

అర్హులైన విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. పేరు, చిరునామా, ఈ- మెయిల్ అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తు దారునికి అప్లికేషన్ నంబరు వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. చదువు, గుర్తింపు కార్డు, తదితర విషయాలకు సంబంధించిన ధ్రువపత్రాలు సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్‌చేసి సైన్ ఆఫ్ చేయాలి. అంతటితో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

పరీక్ష ఏవిధంగా ఉంటుందంటే ...

యశస్వి పథకానికి దరఖాస్తు చేసుకున్నా వారికి మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు మూడు గంటల పాటు పరీక్ష ఉంటుంది. అది కూడా హిందీ , ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది. ఈ పరీక్షకు విద్యార్థులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. పరీక్ష పత్రంలో 100 బహుళైచ్ఛిక ప్రశ్నలుంటాయి. గణితంలో 120 మార్కుల కోసం 30 ప్రశ్నలు, సైన్స్‌లో 80 మార్కులకు 20 ప్రశ్నలు, సోషల్‌లో 100 మార్కుల కోసం 25 ప్రశ్నలు, జనరల్ అవగాహనలో భాగంగా 100 మార్కుల కోసం 25 ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు వీటిని క్షుణ్ణంగా నేర్చుకుని రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా 78 నగరాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. గత ఏడాది సెప్టెంబరు 11న ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా ఆగస్టు 26వ తేదీలోగా విద్యార్థులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హత సాధిస్తే లబ్ధి పొందేదిలా ...

ఉపకార వేతనానికి నిర్వహించే పరీక్షలు ఉత్తీర్ణత సాధిస్తే 9, 10 తరగతులకు ఏటా రూ.75 వేలు, ఇంటర్ లేదా 11 , 12 తరగతులకు ఏడాదికి రూ.1.25 లక్షలు ఉపకార వేతనంగా ఒకేసారి వస్తుంది.

అర్హత సాధించిన తర్వాత....

ఈ ఉపకార వేతనం పొందేందుకు విద్యార్థులు అదే ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా డబ్బు పొందాలనుకుంటున్నారో ఆ బ్యాంకు పాసు పుస్తకం ఫొటో కాపీని జత చేయాలి. ఉపకార వేతనం నేరుగా బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలోనైనా విద్యార్థులు చదువుకోవచ్చు. పాఠశాలల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో ఉంటాయి. అర్హులైన విద్యార్థులు ఈ పథకాన్ని సద్వి నియోగం చేసుకోవచ్చు.

పేదల కోసం మెరుగైన వైద్యం

- నాడు- నేడు ద్వారా రూ.53 కోట్లతో వైద్యశాలలు అభివృద్ధి
- సీ గ్రేడులో నుంచి ఏ, బీ గ్రేడ్‌కు మార్పు



ఇటీవల నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో బ్లడ్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు



అప్‌గ్రేడ్ చేసిన మాచర్ల ప్రభుత్వాస్పత్రి

నరసరావుపేట: జిల్లాలోని పేద ప్రజల కోసం సంపూర్ణమైన వైద్య ఆరోగ్యసేవలు అందజేసేందుకు ప్రభుత్వ హాస్పిటళ్లలో డాక్టర్లు, సిబ్బందితో పాటు సమగ్రమైన సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. దీనికోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.53కోట్లు కేటాయించారు. వీటితో నాడు- నేడు కింద చేపట్టిన ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలో ఏపీ వైద్యవిధాన పరిషత్(ఏపీవీవీపీ) కింద పది హాస్పిటళ్లు ఉన్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లిల్లో మూడు ఏరియా హాస్పిటళ్లు, మాచర్లలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అమరావతి, పెదకూరపాడు, గురజాల, వినుకొండ, విజయపురిసౌత్, ఈపూరులలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటిని వేగంగా అప్‌గ్రేడేషన్ చేస్తున్నారు. నరసరావుపేటలో 20 0పడకల డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలను జిల్లా వైద్యశాలగా పరిగణించాలంటూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన ప్రతిపాదనకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. చిలకలూరిపేటలో ఉన్న 30 పడకల ఏరియా వైద్యశాలను 100పడకల వైద్యశాలగా మార్చారు. సత్తెనపల్లిలో ఉన్న ఏరియా హాస్పిటల్‌లో 50 పడకలను వంద పడకలుగాను, మాచర్లలో ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50పడకలుగా అభివృద్ధి చేస్తున్నారు. అలాగే వినుకొండలో వంద పడకల హాస్పిటల్ చేసేందుకు ఎస్‌ఎస్పీ కాలనీలో స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. అలాగే అక్కడే ఒక ట్రామాకేర్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. నరసరావుపేట వైద్యశాలలో రెడ్‌క్రాసు సహాయంతో ఏర్పాటుచేస్తున్న కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్ జిల్లా ప్రజల అవసరాలను తీర్చనుంది. దీనికి కావాల్సిన రూ.4.5 కోట్ల విలువైన పరికరాలు రాగా, మరో నెలరోజుల్లో అందుబాటులోకి రానుంది. థలసేమియా రోగులకు కావాల్సిన రక్తం, పలు రోగులకు కావాల్సిన ప్లేట్‌లెట్స్ అందుబాటులోకి రానున్నాయి. దీనికి అదనంగా మాచర్ల లాంటి సుదూర ప్రాంతాల నుంచి నరసరావుపేట వరకు వచ్చే శ్రమను తప్పించేందుకు అక్కడనే మరో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చిలకలూరిపేటలో మరో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం కిడ్నీ రోగులకు సేవలు అందజేసే డయాలసిస్ సెంటర్లు నరసరావుపేట, మాచర్లలో 17బెడ్లతో ఉండగా వినుకొండలో మరొకటి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చేశారు. వీటితో పాటు పిడుగురాళ్లలో రూ.350 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వైద్యకళాశాల నిర్మాణం వేగంగా జరుగుతుండగా అందులోని హాస్పిటల్‌ను వచ్చే జూన్‌లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సిక్ న్యూబర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీ) నరసరావుపేటకు మంజూరు చేశారు. ఇటీవలనే ప్రభుత్వం తీసుకొచ్చిన ఫామిలీ డాక్టర్ విధానంలో అవసరమైన డాక్టర్లను ఏపీవీవీపీకు చెందిన హాస్పిటళ్లు అందజేస్తున్నాయి.

అన్ని వైద్య సదుపాయాలు

వైద్యరంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న శ్రద్ధతో పల్నాడు జిల్లాలోని వైద్యరంగం పీక్ స్టేజ్‌కు చేరింది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విడదల రజని వైద్యశాఖ మంత్రిగా ఉండటం ప్రజల అదృష్టం. ఆల్కాహాలు, డ్రగ్స్‌కు అలవాటుపడిన వారిని జీవన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు నరసరావుపేటలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశారు. గతంలో అన్నీ హాస్పత్రులు సీ గ్రేడ్‌లో ఉండగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నాలుగు హాస్పిటల్స్ ఏ గ్రేడు, నాలుగు హాస్పిటళ్లు బీ గ్రేడు, ఒకటి సీ గ్రేడుకు చేరాయి.

– డాక్టర్ బీవీ రంగారావు, జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి

అమరేశ్వరుని సన్నిధిలో ఎన్‌ఐఏ డైరెక్టర్ వందన

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ దక్షిణాది రాష్ట్రాల డైరెక్టర్ వందన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, వేద పండితులు ఎన్‌ఐఏ డైరెక్టర్ వందనకు స్వామివారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. గౌహతి-సికింద్రాబాద్(02604) రైలు ఈనెల 6న గుంటూరు డివిజన్ మీదుగా నడుస్తుందని వివరించారు. అలాగే డిబ్రునగర్-సికింద్రాబాద్ (02904) రైలు వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 8న ప్రయాణిస్తుందని వెల్లడించారు.

89,314 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 86,613 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 89,314 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. యార్డులో ఇంకా 60,478 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
- సిబ్బంది తీరుపై అసహనం

నరసరావుపేట రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మండలంలోని యల్లమంద విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్‌ను శుక్రవారం నిఖీ చేశారు. ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, సిబ్బంది పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం దిశగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలయ్యే గ్రామాల్లో ముందురోజే ప్రజలకు సమాచారం తెలియజేసే విధంగా ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌లు సమావేశం ఏర్పాటు చేసుకొని వలంటీర్ల ద్వారా గ్రామంలోని ప్రజలకు సమాచారం తెలియజేయాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం ఆ వివరాలను ఎంఓ హెల్త్ యాప్, ఎంఎల్‌హెచ్‌పీ యాప్‌లో నమోదు చేయాల్సి ఉండటంతో హెల్త్ సెంటర్‌లో విధుల్లో ఉన్న వైద్యుడు, సిబ్బంది వద్ద ఉన్న యాప్‌లను పరిశీలించారు. గ్రామస్తులకు సమాచారం లేక రోగులు రాకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను మందలించారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే ఎంత వరకు చేశారని సిబ్బందిని ప్రశ్నించారు. నెలలో రెండు సార్లు డాక్టర్‌లు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంలో గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకునేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. వైద్యులు తొలిసారి గ్రామాన్ని సందర్శించిన సమయంలోనే రోగులకు వైద్య పరీక్షలు పూర్తిచేసి మందులు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారిణి శోభారాణి, మండల స్పెషల ఆఫీసర్ నాగ శ్రీనివాస్, డాక్టర్ మమత, తహసీల్దార్ రమణానాయక్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

దాచేపల్లి: హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ షేక్ బిలాలుద్దీన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని శ్రీనగర్‌కు చెందిన కొండ మడుగుల రవీంద్రారెడ్డిని హత్య చేసిన అదే గ్రామానికి చెందిన ఆళ్ల వెంకటరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. గత నెల 19వ తేదీ రాత్రి శ్రీనగర్ గ్రామ సమీపంలోని పొలాల్లో రవీంద్రారెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. పలు కోణాల్లో పోలీసులు విచారణ చేసి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆళ్ల వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా రవీంద్రారెడ్డిని హత్య చేసినట్లు నేరం అంగీకరించాడు. పొలం తగదాలతో పాటుగా వ్యక్తిగత కారణాలతోనే రవీంద్రారెడ్డిని కర్ర, రాయితో బలంగా కొట్టి హత్య చేసినట్లు వెంకటరెడ్డి నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

15 నుంచి హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి హౌస్ వైరింగ్, రిఫ్రిజరేటర్ అండ్ ఎయిర్ కండిషన్ సర్వీసింగ్‌లలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ 30 రోజులు ఉంటుందని, వయస్సు 19 నుంచి 44 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటు, వసతి సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్ జిరాక్సు కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని ఆయన వివరించారు.

వాహనాలకు త్రైమాసిక పన్నులు చెల్లించాలి

పట్నంబజారు(గుంటూరు): జిల్లాలో వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్నులు చెల్లించాల్సిన యజమానులు త్వరగా చెల్లించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం చెప్పారు. ఈమేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రవాణా వాహనాలు కొన్ని పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నాయని, అటువంటి వాహనాలను పన్నులు చెల్లించకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఆ వాహన యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, ఇకపై ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. తనిఖీల్లో పట్టుబడితే త్రైమాసిక పన్నుతోపాటు 200 శాతం అధికంగా జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కచ్చితంగా ప్రతి ఒక్క వాహన యజమాని పన్నులు చెల్లించాలని సూచించారు.